Cell: 93953 85229
86887 83383
Jai DURGA BHAVANI
BUILDING PLANNERS
hmda GHMC RERA
TC
GSTIN : 36AALCT0108J1ZD
CIN :U68200TS2024PTC185715
TAGARAM CONSTRUCTIONS DREAM TO REALITY
TAGARAM
CONSTRUCTIONS PRIVATE LIMITED


TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 121 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | సోమవారం 07 అక్టోబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-



ఎవరు అడ్డుపడినా

# మూసీ ప్రక్షాళన ఆగదు

- మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం
- మూసీ పరీవాహక ప్రాంతం బఫర్ జోన్ లో ఉన్న ఇళ్ల తొలగింపు
- మూసీ నిర్వాసితులను ఆదుకుంటామన్న రేవంత్ రెడ్డి
- కేసీఆర్ కుటుంబం పేదలను రెచ్చగొడు తోందని ఆగ్రహం

**శాసనసభ / హైదరాబాద్ :** మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టును సాకారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ క్రమంలో మూసీ నది పరీవాహక ప్రాంతం బఫర్ జోన్ లో ఉన్న ఇళ్లను తొలగిస్తోంది. ఈ నేపథ్యంలో, సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఎవరు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదని, మూసీ మురికిని వదిలిస్తామని స్పష్టం చేశారు. మూసీ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు."ఇవాళ మూసీ నది అంటే మురికి కూపం అనే పేరు స్థిరపడిపోయింది. ప్రజలు నిరాశ్రయులవుతారని ప్రాజెక్టులు కట్టకుండా ఉంటారా? మల్లన్నసాగర్, కొండపోచమ్మ, గంధమల్ల రిజర్వాయర్లతో ఎవరి భూములు పోలేదా? మల్లన్నసాగర్ పరిధిలో రైతులను కొట్టి, తొక్కించి, బలవంతంగా ఖాళీ చేయించారు. కేసీఆర్ కుటుంబం ఇప్పుడు పేదలను రెచ్చగొడుతోంది... కేసీఆర్ కుటుంబ సభ్యులు ఏనాడైనా పేద ప్రజల కోసం ఏమైనా చేశారా?" అని రేవంత్ రెడ్డి నిలదీశారు. అనవసర విమర్శలు పక్కనబెట్టి, మూసీ నిర్వాసితులను ఎలా ఆదుకుందామో సలహాలు ఇవ్వండి అని విపక్షాలకు సూచించారు.

## కాశ్మీర్‌లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాదు..?

### అసలు తప్పు ఎక్కడ జరిగింది..?




**ఢిల్లీ / శాసనసభ :** కాశ్మీర్ లోయలో ఉగ్రవాదాన్ని అంతం చేసి, ఆ ప్రాంతంలో అభివృద్ధి చేపట్టాలని బీజేపీ ఎన్నో ప్రయత్నాలు చేసింది. గతంలో ప్రతీ శుక్రవారం రాళ్లు రువ్వే సంస్కృతికి చరమగీతం పలికింది.అయినా కూడా తాజాగా జరిగిన ఎన్నికల్లో కాశ్మీర్ లోయ ప్రాంతంలోని ఓటర్లు బీజేపీకి వేటేసేందుకు పెద్దగా ఇష్టం చూపలేదు. ఈ విషయం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలనుబట్టి చూస్తే తెలుస్తోంది. బీజేపీ ఇచ్చిన 'నయా కాశ్మీర్' నినాదం పెద్దగా పనిచేయలేదని తెలుస్తోంది. సీఓటర్ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. చూస్తే జమ్మూ కాశ్మీర్‌లో హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా. నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ)-కాంగ్రెస్ కూటమి 95 స్థానాలు ఉన్న అసెంబ్లీలో 40-48 స్థానాలు గెలుచుకుంటుందని అంచానా వేసింది.

మిగతా »»2లో

## సీఎం రేవంత్ రెడ్డికి ఈటల బహిరంగ లేఖ

- మూసీ ప్రక్షాళనపై స్పందించిన ఈటల
- తాను పేదల కోసం కొట్లాడిన వ్యక్తినని వెల్లడి
- మూసీ ప్రక్షాళనను అడ్డుకోబోనని స్పష్టీకరణ
- కానీ పట్టా ఇళ్లలో ఉంటున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం



3

## తెలంగాణలో రూ.5 వేల

### కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లు



- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ల నమూనా విడుదల
- కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మంత్రులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు నెలకొల్పుతున్నామన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మిగతా »»2లో

### అవాస్తవాలు చెప్పడం ఆపి

## రుణమాఫీ పూర్తి చేయండి..

### హరీశ్‌రావు బహిరంగ లేఖ



2

### సీఎం ఢిల్లీ పర్యటన

## ఖరారు..

### ప్రధానితో భేటీ కానున్న చంద్రబాబు



2

### ఆరేళ్ల చిన్నారి

## హత్య కేసును

### ఛేదించినట్లు ప్రకటించిన హోంమంత్రి అనిత




2

### ఆ రెండు రాష్ట్రాల్లో బీజేపీకి ఓటమి

## ఖాయం

3



- ఢిల్లీలో జనతా కీ అదాలత్
- హాజరైన అరవింద్ కేజ్రీవాల్
- బీజేపీపై విమర్శనాస్త్రాలు

### వందలాది రైతులు

## పిట్టల్లా రాలిపోతున్నా..

### ముఖ్యమంత్రికి సోయి లేదు

- ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలి
- పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నరు
- కౌలు రైతులకూ అందని సాయం.
- రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలు



**శాసనసభ/ హైదరాబాద్ :** రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ సర్కారే కారణమని విమర్శించారు.పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నరు, కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారని దుయ్యబట్టారు. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం చోటుచేసుకున్నది చెప్పారు.

మిగతా »»2లో

### మీ పాత స్పీచ్‌లు..

## భాజపా వైఫల్యాలను కప్పిపుచ్చలేవు

### మోదీపై ఖర్గే విమర్శలు

**ఢిల్లీ / శాసనసభ :** ప్రధాని నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు.ప్రధాని ఎప్పుడూ పాత ప్రసంగాలే చేస్తున్నారని.. మళ్లీ మళ్లీ వాటినే పునరావృతం చేసినా దేశ ఆర్థిక వ్యవస్థలో భాజపా ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చలేరన్నారు. మేకిన్ ఇండియా విఫలమైందన్న ఖర్గే.. ప్రజలపై గృహ రుణాల భారం, ధరల పెరుగుదల, తయారీ రంగంలోని సమస్యలను లేవనెత్తారు."మోదీ ఆర్థిక నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థకు శాపంగా మారాయి.



మిగతా »»2లో

శాసనసభ
సోమవారం 07 అక్టోబర్ - 2024

( మొదటి పేజీ తరువాయి )

## వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా.. ముఖ్యమంత్రికి సోయి లేదు

వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ముఖ్యమంత్రికి చలనం లేదని, ప్రభుత్వానికి బాధ్యత లేదని ఫైరయ్యారు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండుగలా మార్చిన సీఎం రేవంత్ కు రైతన్నల చేతిలో దండన తప్పదని హెచ్చరించారు. అన్నదాతలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని కోరారు. ముంచే రోజులు తొందర్లోనే పోతాయని, మంచి రోజులు మళ్లీ వస్తాయంటూ ట్వీట్ చేశారు."పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నారు. కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారు. ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ సర్కారే కారణం. ఓవైపు సాగునీటి సంక్షోభం. మరోవైపు రుణమాఫీ ద్రోహం. ఇంకోవైపు రైతుభరోసా మోసం. కౌలు రైతులకూ అందని సాయం. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం. వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా చలనం లేదు. ముఖ్యమంత్రికి సోయి లేదు.. ప్రభుత్వానికి బాధ్యత లేదు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండుగలా మార్చిన.. సీఎం రేవంత్ కు రైతన్నల చేతిలో దండన తప్పదు. అన్నదాతలారా ఆత్మస్థైర్యం కోల్పోకండి. ముంచే రోజులు పోతాయ్.. మళ్లీ మంచిరోజులొస్తాయ్.

## తెలంగాణలో రూ.5 వేల కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లు

గత ప్రభుత్వం పేద విద్యార్థులను పట్టించుకోలేదన్న కోమటిరెడ్డి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థ నవీకరణకు కీలక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లు నెలకొల్పాలని నిశ్చయించింది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ కు 20 నుంచి 25 ఎకరాల స్థలం కేటాయించనున్నారు. ఇవాళ జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ల నమూనా విడుదల చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రూ.5 వేల కోట్లతో ఈ స్కూల్ కాంప్లెక్స్ ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు.అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది నుంచే అన్ని నియోజకవర్గాల్లో స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నామని భట్టి విక్రమార్క వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు రాష్ట్ర ప్రజలకు దసరా కానుక అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో పేద విద్యార్థులను పట్టించుకోలేదని విమర్శించారు. చదువుకుంటే బాగుపడతారనేది ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు.

## అవాస్తవాలు చెప్పడం ఆపి రుణమాఫీ పూర్తి చేయండి.. హరీశ్‌రావు బహిరంగ లేఖ

హైదరాబాద్: అవాస్తవాలు చెప్పడం మానేసి హామీ ప్రకారం రుణమాఫీ పూర్తి చేయాలని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ బహిరంగ లేఖ రాశారు. "రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆయన మోసపూరిత వ్యూహాలు దేశమంతా పాకినట్లు కనిపిస్తోంది. ప్రజలను నమ్మించేందుకు సీఎం దేవుళ్లపై ప్రమాణం చేశారు.31 రకాల షరతులు పెట్టి చాలా మందిని రుణమాఫీకి దూరం చేశారు. ఎస్‌బీఐలోనే 50శాతం రైతుల రుణాలు మాఫీ కాలేదని డేటా చెప్తోంది. రూ.2లక్షలకు మించి ఉన్న మొత్తాన్ని చాలా మంది రైతులు చెల్లించారు. వెంటనే రుణమాఫీని పూర్తి చేయాలి"అని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు.

## ఆరేళ్ల చిన్నారి హత్య కేసును ఛేదించినట్లు ప్రకటించిన హెూంమంత్రి అనిత

పుంగనూరులో ఆరేళ్ల చిన్నారి హత్య కేసును పోలీసులు ఛేదించారు. అస్ఫియా హత్య కేసును ఛేదించినట్లు హెూంమంత్రి అనిత స్వయంగా ప్రకటించారు.అస్ఫియా ఆచూకీ కోసం 12 ప్రత్యేక పోలీసు బృందాలు గాలించినట్లు హెూంమంత్రి తెలిపారు. చిన్నారి హత్యకు గురికావడం బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో వందలమందిపై అత్యాచారాలు జరిగాయని తీవ్రంగా విమర్శించారు. ఒక్కరోజు జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాలేదన్నారు. చిన్నారి హత్యకేసును వైసీపీ రాజకీయం చేస్తోందన్నారు. చిన్నారిపై అత్యాచారం జరగలేదని, చిన్న గాయం లేదని పోస్టుమార్టం రిపోర్టులో తేలిందని హెూంమంత్రి అనిత వెల్లడించారు. ఇదిలా ఉండగా.. అస్ఫియా కుటుంబసభ్యులతో సీఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు.అనంతరం మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారి మృతి అత్యంత బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి మేమందరం అండగా ఉంటామని భరోసా ఇవ్వడానికి వచ్చామన్నారు.వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని మంత్రి తెలిపారు. వైసీపీ నేతలు చిన్నారి హత్యను కూడా రాజకీయం కోసం వాడుకుంటున్నారని విమర్శించారు.అత్యాచారం జరిగిందని అసత్య ప్రచారాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని కుట్రలు చేస్తున్నాకరన్నారు.

## సీఎం దిల్లీ పర్యటన ఖరారు.. ప్రధానితో భేటీ కానున్న చంద్రబాబు

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీలో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం దిల్లీ చేరుకొని, సాయంత్రం 4.30 గంటలకు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు.అనంతరం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమవుతారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, గడ్కరీ, నిర్మలా సీతారామన్‌తో మంగళవారం భేటీ కానున్నారు.బుడమేరు వరదలపై కేంద్రానికి నివేదిక ఇచ్చిన తర్వాత చంద్రబాబు.. ప్రధానిని కలవడం ఇదే తొలిసారి. రైల్వే జోన్, సెయిల్‌లో విశాఖ ఉక్కు విలీనం, వరద నిధులపై చర్చించే అవకాశముంది. ప్రపంచ బ్యాంకు నుంచి అమరావతి నిర్మాణానికి నిధుల్లో ఆటంకం లేకుండా చూడాలని చంద్రబాబు కోరనున్నట్లు సమాచారం.

## తెలంగాణ బియ్యమే కావాలంటూ ఫిలిప్పీన్స్ పట్టు



**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణ బియ్యం కావాలంటూ ఫిలిప్పీన్స్ దేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ దేశ ఆహార, వ్యవసాయశాఖ మంత్రి రోజేర్స్ తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఈ విషయంపై చర్చించారు.ఫిలిప్పీన్స్ ప్రతినిధులు కొద్దిరోజుల క్రితం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కమిషనర్ డీఎస్ చౌహాన్, ఇతర నిపుణులతో మాట్లాడి వెళ్లారు.ఈ క్రమంలో పౌర సరఫరాల భవన్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్, ఫిలిప్పీన్స్ మంత్రి రోజేర్స్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి 3 లక్షల టన్నుల బియ్యం ఎగుమతుల అంశం ప్రతిపాదనపై ప్రాథమికంగా చర్చించారు. తెలంగాణ బియ్యం నాణ్యత గణనీయంగా మెరుగుపడిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.రాష్ట్రంలో ధాన్యం రకాలు, బియ్యం నాణ్యతపై మంత్రి వివరించారు. విదేశాలకు బియ్యం ఎగుమతులపై ప్రస్తుతం 10 శాతం సుంకం ఉంది. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న నేపథ్యంలో బియ్యం ఎగుమతుల విషయంలో సుంకం మినహాయింపుపై రాష్ట్రప్రభుత్వం దృష్టి పెట్టింది.ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్ణయించారు. ఆయన త్వరలో ఫిలిప్పీన్స్‌కు వెళ్లి మరో దఫా చర్చలు జరపనున్నారు. ఈ ప్రక్రియ కొలిక్కి వచ్చాక బియ్యం ధరపై నిర్ణయంపై తీసుకోనున్నట్లు పౌరసరఫరాలశాఖ వర్గాలు తెలిపాయి.ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఫిలిప్పీన్స్ మంత్రి ఇద్దరూ పూర్తి పరస్పర సహకారానికి హామీ ఇచ్చారు. ఒప్పందం త్వరలో కార్యరూపం దాల్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది కార్యరూపం దాలిస్తే తెలంగాణ పౌరసరఫరాల శాఖకు మరో అవకాశం అవుతుంది. బియ్యం నాణ్యతను మెరుగుపరచడం, ప్రమాణాలకు అర్హత ఉండటంతో, తమ వరి సంవత్సరాల విరామం తర్వాత ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి అయ్యే అవకాశం ఉంది అని అధికారులు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మార్కెట్‌లో ప్రాధాన్యతనిచ్చే చక్కటి రకాల సాగును ప్రోత్సహిస్తోంది. వరి 12 మిలియన్ ఎకరాలకు పైగా సాగు చేయబడుతోంది. వార్షిక ఉత్పత్తి 26 మిలియన్ టన్నుల క్రమంలో ఉంది. రాష్ట్రంలో 220కి పైగా వరి రకాలను పండిస్తున్నారు. దేశం నుంచి బియ్యం ఎగుమతుల విషయానికొస్తే, భారతీయ వరి రకాలు 100 దేశాలలో మెరుగైన మార్కెట్‌ను కలిగి ఉన్నాయి. గ్లోబల్ మార్కెట్ వాటాలో దేశం 45 శాతాన్ని ఆక్రమించిందని, భవిష్యత్తులో 2030 నాటికి అనేక దేశాలకు ఆహారం అందించేందుకు భారత్‌లో మిగులు బియ్యం లభిస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వివరించారు.

## మాజీ మంత్రితో అరికెపూడి గాంధీకి బీఆర్ఎస్ చెక్..!!



**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారి పైన అనర్హత వేటు వేయాలని గులాబీ పార్టీ నేతలు కోర్టును ఆశ్రయించారు.ఇప్పటికే కోర్టు దీని పైన ఆదేశాలు ఇచ్చింది. అదే సమయంలో పార్టీ వీడిన వారి నియోజకవర్గాల్లో కొత్త నాయకత్వం సిద్దం చేసేందుకు కేసీఆర్ సిద్దమయ్యారు. అందులో భాగంగా అరికెపూడి గాంధీ నియోజకవర్గం లో పాగా వేసేందుకు బీఆర్ఎస్ మాజీ మంత్రి ప్రయత్నాలు ప్రారంభించారు. మారుతున్న లెక్కలు బీఆర్ఎస్ నుంచి గెలిచిన అరికెపూడి గాంధీ తాజాగా కాంగ్రెస్ కు దగ్గరయ్యారు. కొద్ది రోజుల క్రితం కౌశిక్ రెడ్డి ఇంటి పైన దాడి వ్యవహారంలో రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు కారణమయ్యారు. శేరిలింగంపల్లిలో సమీకరణాలు గాంధీకి ఎన్నికల్లో కలిసి వచ్చాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ గ్రేటర్ లో మాత్రం పట్టు నిలబెట్టుకుంది. ఇక..గ్రేటర్ లో తమకు ఉన్న బలం కొనసాగేలా బీఆర్ఎస్ కొత్త వ్యూహాలు సిద్దం చేస్తోంది. అందులో భాగంగా గాంధీ పార్టీని వీడటంతో శేరిలింగంపల్లి నుంచి రంగంలోకి దిగేందుకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీలో ప్రచారం సాగుతోంది.గాంధీ స్థానంలో గత ఏడాది జరిగిన అసెంబ్లీఎన్నికల్లో పువ్వాడ అజయ్ ఖమ్మం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మంత్రి తుమ్మల అక్కడ విజయం సాధించారు. సామాజిక సమీకరణాలు...ఓటింగ్ అంశాలను పరిగణలోకి తీసుకుంటే శేరిలింగంపల్లి తనకు కలిసి వస్తుందని అజయ్ అంచాన వేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. అక్కడ పెద్ద సంఖ్యలో సెటిలర్ల ఓట్లు ఉన్నాయి. నియోజకవర్గంలో కమ్మ వర్గం ఓటింగ్ సైతం ఎక్కువగా ఉంది. అరికెపూడి గాంధీ పార్టీ మారడంతో ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని పువ్వాడ భావిస్తున్నారని సమాచారం. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే వచ్చే ఎన్నికల్లో గెలుపు ఖాయమని పువ్వాడ భావిస్తున్నారు.ఖమ్మం వీడుతారా దీంతో..వచ్చే ఎన్నికల నాటికి శేరిలింగంపల్లిలో బలపడేలా తాను అక్కడ పని చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని అజయ్ పార్టీ నాయకత్వాన్ని కోరినట్లు తెలుస్తోంది. కానీ, ఖమ్మంలో పువ్వాడ అజయ్ బలమైన నాయకుడు కావటం..ఖమ్మం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలవటంతో గ్రేటర్ కంటే ఖమ్మంలో అజయ్ అవసరం ఎక్కువ అవసరమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఇదే సమయంలో అజయ్ ఖమ్మం కాదని..మరో నియోజకవర్గానికి వెళ్లే అవకాశం లేదని ఆయన అనుచర వర్గం చెబుతోంది. దీంతో, ఇప్పుడు శేరిలింగంపల్లి విషయంలో కేసీఆర్ తుది నిర్ణయం ఏంటనేది స్పష్టత రావాల్సి ఉంది.

## 'అమరావతి డ్రోన్ సమ్మిట్'.. లోగో విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం



**అమరావతి / శాసనసభ :** ఈ నెల 22, 23 తేదీల్లో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ఘనంగా నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజులపాటు జరిగే సమ్మిట్‌కు సీఎం చంద్రబాబు సహా కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఉమ్లున్మాంగ్ పుల్నమ్ హాజరుకానున్నారు.ఈ కార్యక్రమానికి సంబంధించి లోగో, వెబ్‌సైట్‌ను రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్, ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ ఎండీ దినేష్ కుమార్ విజయవాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేశ్ కుమార్ మాట్లాడుతూ.. డ్రోన్ సాంకేతికత - వినియోగం, దానివల్ల ఎదురయ్యే సవాళ్లు వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఏ విభాగాల్లో డ్రోన్లు వాడి మెరుగైన సేవలు పొందవచ్చనే విషయాలపై అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి ప్రతిపాదనలు తీసుకున్నామని, వీటి రూపకల్పనపై చర్చిస్తామన్నారు.దేశవ్యాప్తంగా ఉన్న అన్ని డ్రోన్ తయారీ సంస్థలు, డ్రోన్ తయారీ నిపుణులు సమ్మిట్‌లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. సమ్మిట్‌కు వచ్చే వారు 'అమరావతి డ్రోన్ సమ్మిట్' వెబ్‌సైట్‌లో ఈనెల 15 వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. విజయవాడలో హ్యాకథాన్‌ను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 22న దేశంలో ఎక్కడా జరగని విధంగా 5 వేల డ్రోన్లతో విజయవాడ బరం పార్కులో డ్రోన్ షో నిర్వహిస్తామని తెలిపారు. భారీ డ్రోన్ షోను ప్రజలు ఉచితంగా వీక్షించవచ్చన్నారు. అత్యాధునిక సేవలందించే డ్రోన్లు తయారు చేసిన వారికి ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పారు. ఎంపికైన డ్రోన్‌కు ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష అందిస్తామన్నారు. డ్రోన క్యాపిటల్‌గా ఏపీ మారాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమని, దీన్ని నెరవేర్చడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డ్రోన్ సమ్మిట్‌లో ప్రజలు, విద్యార్థులు, నిపుణలు, తయారీ దారులు ఎవరైనా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొనవచ్చన్నారు.

## కేసీఆర్ కనిపించడం లేదంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**శాసనసభ / హైదరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కనిపించడం లేదని, ఆయన ఎక్కడున్నారో వెతకాలంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది.ఈ మేరకు టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు కార్యకర్తలతో కలిసి సిద్దిపేట జిల్లా గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రావు మాట్లాడుతూ.. పదేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్.. ప్రస్తుతం గజ్వేల్ ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీలో జరిగే చర్చల్లో పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పోలీసులు పది రోజుల్లో ఆచూకీ తెలపకపోతే.. తామే ఆయన కోసం గాలింపు చర్యలు చేడతామని శ్రీకాంత్ రావు తెలిపారు.కాగా, గత సెప్టెంబర్ నెలలో భారీ వర్షాలు కురిసన సమయంలో హైదరాబాద్ నగరంలో కేసీఆర్ కనబడటం లేదంటూ పలు పోస్టర్లు వెలిసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రంలో రెండుసార్లు అధికారం ఇచ్చిన ప్రజలు వరదల్లో కష్టాలు పడుతుంటే ప్రతిపక్ష నేత కేసీఆర్ పత్తా లేడు అంటూ సదరు పోస్టర్లలో పేర్కొన్నారు. అయితే, ఈ పోస్టర్లు ఎవరు ఏర్పాటు చేశారనేది మాత్రం తెలియరాలేదు.భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. ప్రతిపక్ష నేత హెూదాలో ఉన్న కేసీఆర్ వరద బాధితులను పరామర్శించేందుకు బయటకు రాకపోవడంపై అప్పటికే అధికార పక్షం నేతలు విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ కనబడుట లేదు అంటూ పోస్టర్లు ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. ఆ తర్వాత తాజాగా, కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో ఆయన కనిపించడం లేదంటూ పోలీసులకు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

## కూకట్ పల్లిలో ఏం జరుగుతోంది.. ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు..!



**శాసనసభ / హైదరాబాద్:** కొద్ది రోజుల క్రితం కూకట్ పల్లిలోని ఓ అపార్ట్ మెంట్ దగ్గరలోని నిర్మానుష్య ప్రాంతంలో మహిళ మృతదేహం కనిపించింది. మొదటగా సదరు మహిళను అత్యాచారం చేసి హత్య చేసినట్లు భావించారు.అయితే పోలీసులు విచారణలో విస్తుపోయే నిజాలు బయటకొచ్చాయి. ఆ మహిళను మరో మహిళ హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో నిందితురాలు ప్రియాంకను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్ కుమార్ తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం కూకట్ పల్లిలోని భాగ్యనగర్ కాలనీ ప్రాంతంలో ప్రియాంక అనే మహిళ ఉంటుంది. ఈమె వ్యభిచారమే వృత్తిగా జీవిస్తోంది. అలాగే ఎల్లమ్మబండాలోని ఎన్టీఆర్ నగర్ లో మంజుల అనే మహిళ నివసిస్తోంది. ఈమె కూడా వ్యభిచారం చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో మంజుల, ప్రియాంకకు పరిచయం ఏర్పడింది. ప్రియాంక తను ఉంటున్న ఇంటి వద్ద భద్రత లేదని.. తన చెవి కమ్మలు, పలు వెండి ఆభరణాలను మంజులకు ఇచ్చి దాచమని చెప్పింది. దీంతో మంజుల వాటిని తీసుకెళ్లింది.కొద్ది రోజుల తర్వాత ప్రియాంక తన చెవి కమ్మలు, వెండి ఆభరణాలు తిరిగి ఇవ్వాలని కోరింది. అయితే మంజుల వాటిని ఇచ్చేందుకు ఒప్పుకోలేదు. చివరికి ప్రియాంక స్థానికంగా ఉన్నవారితో మంజులను బెదిరించింది. దీంతో మంజుల ఆభరణాలు తిరిగి ప్రియాంకకు ఇచ్చేసింది. ప్రియాంకపై పగ పెంచుకున్న మంజుల మంచిగా ఉన్నట్లు యాక్టింగ్ చేసింది. ప్రియాంక బట్టలు చింపేసింది. మృతదేహాన్ని నగ్నంగా ఉంచి వెళ్లిపోయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా మంజులను అదుపులోకి తీసుకుని విచారించగా.. హత్య చేసినట్లు ఒప్పుకుంది. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఆమ్రాబాద్ కు చెందిన ప్రియాంకకు పెళ్లయింది. ఆమె ఒక కూతురు కూడా ఉంది. అయితే భర్తతో విడిపోయి.. బిడ్డను వదిలి 2 నెలల క్రితం హైదరాబాద్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

( మొదటి పేజీ తరువాయి )

## మీ పాత స్పీచ్‌లు.. భాజపా వైఫల్యాలను కప్పిపుచ్చలేవు: మోదీపై ఖర్గే విమర్శలు

మోదీజీ.. మీరు పాత ప్రసంగాలనే పునరావృతం చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో భాజపా ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చలేరు. 2013-14 నుంచి నేటి వరకు గృహ సంబంధిత ఖర్చులు 241 శాతం పెరిగాయి. జీడీపీలో గృహ రుణం ఎన్నడూ లేని విధంగా పెరిగింది. కొవిడ్ సమయం నుంచి ప్రజలకు ఆదాయం కంటే ఖర్చు రెట్టింపైంది" అని ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు."గతేడాదితో పోలిస్తే.. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు పెరిగాయి. ధరల పెరుగుదల భాజపా తీసుకున్న నిర్ణయం. అసంఘటిత రంగాన్ని నాశనం చేయడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. యూపీఏ హయాంలో పెరిగిన భారత్ ఎగుమతుల లాభాలను మీ విధానాలతో విస్మరించడం వల్లే 10ఏళ్లలో మేకిన్ ఇండియా ఘోరంగా విఫలమైంది" అంటూ మండిపడ్డారు. మరోవైపు, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ భాజపా ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు.అలాగైతే భాజపాకే ప్రచారం చేస్తా: ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్!రాహుల్ మండిపాటు మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భాజపా ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. "గోవాలో భాజపా ఉద్దేశపూర్వకంగా మతపరమైన ఉద్రిక్తతలు సృష్టిస్తోంది. అక్కడ సామరస్యం దెబ్బతింటోంది. దీనికి కారణం కాషాయ పార్టీనే. గోవాలో భాజపా వ్యూహమేంటో స్పష్టమవుతోంది. పర్యావరణ నిబంధలను ఉల్లంఘిస్తోంది. అక్కడి ప్రాంతాలను దోచుకుంటోంది. ప్రజలను విభజించేందుకు ప్రయత్నిస్తోంది. ఇది గోవా సామాజిక వారసత్వంపై దాడి చేయడమే అవుతుంది" అన్నారు.

శాసనసభ



# ఆరు, శ్రీమిత్ర వెంచర్స్ ప్రారంభోత్సవం

## - ముఖ్యఅతిథులుగా సినీనటులు శ్రీకాంత్, తరుణ్






**చింతపల్లి, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చింతపల్లి మండల కేంద్రంలో ఆరు, శ్రీ మిత్ర వెంచర్ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి సినీనటులు శ్రీకాంత్, తరుణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాయి సన్నిధి వెంచర్ బ్రోచర్ ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్,మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్, ఉజ్జిని యాదగిరిరావు, శ్రీమిత్ర సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మేడికొండూరి వెంకట చౌదరి, డైరెక్టర్లు తేజ్ నివాస్, తేజ్ గోవిందు ఆరు, శ్రీ మిత్ర యాజమాన్యం తో కలిసి ప్రారంభించారు. అనంతరం శ్రీ మిత్ర టౌన్షిప్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట చౌదరి మాట్లాడుతూ నాగార్జునసాగర్ -హైదరాబాద్ ప్రధాన రహదారికి సమీపంలో సకల సౌకర్యాలతో ఏర్పాటుచేసిన సాయి సన్నిధి వెంచర్ లో పర్యాటకులకు విడిది చేసేందుకు విల్లాలను నిర్మిస్తామని తెలిపారు.శ్రీకాంత్, తరణ్ మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు నుండి సాయి సన్నిధి వరకు 80 కిలోమీటర్ల దూరంలో వెంచర్ నిర్మించడం జరిగిందని, 10 కిలోమీటర్ల మేరకు దగ్గరలో త్రిబుల్ ఆర్ కూడా అందుబాటులోకి వస్తుందని, హైదరాబాద్ నుండి నాగార్జునసాగర్ ఫోర్ లైన్ రోడ్డు సాంక్షన్ కావడం జరిగిందని వారు అన్నారు. 127 ఎకరాలు సైజు సన్నిధి వెంచర్ ఏర్పాటు చేయడం జరిగిందని, సకల సౌకర్యాలతో అతి తక్కువ ధరలో ఇన్స్టాల్మెంట్ రూపంలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉన్నందువల్ల ప్లాట్లు కొనుగోలు చేయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ ఫోర్ లైన్ రోడ్డు విస్తరణ త్రిబుల్ ఆర్ రైల్వే మార్గం తదితర సదుపాయాలు ఈ ప్రాంతానికి రానున్నాయని, విద్య వ్యాపారం పరిశ్రమలతో ముందు ముందు ఎంతో అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం వెంచర్ ప్రారంభానికి వచ్చినటువంటి ప్రముఖులకు, నాయకులకు శాలువాలతో మర్యాదపూర్వకంగా సంస్థ యాజమాన్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ దేవరకొండ మాజీ కొండూరు పవన్, మాజీ వైస్ ఎంపీపీ యాదగిరి గౌడు, సిరాజ్ ఖాన్, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, కుంభం పుల్లారెడ్డి, అంగిరేకుల నాగభూషణం, దొంతం సంజీవరెడ్డి, దేప శైలేందర్ రెడ్డి బ్రదర్స్, గోవిందు యాదగిరి, గోవిందు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యారంటీ కస్టమ్స్!



**శాసనసభ / హైదరాబాద్:** మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీ తీసుకున్న తర్వాతే కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యాన్ని అప్పగించాలని సర్కారు ఇప్పటికే నిర్ణయించింది. ధాన్యం విలువలో 25 శాతం బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలని కూడా అధికారులు స్పష్టం చేశారు. దీనిని మిల్లర్లు వ్యతిరేకిస్తున్నారు. సీఎంఆర్ తీసుకోబోమని స్పష్టం చేస్తున్నారు. కానీ, కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు అప్పనంగా ఇవ్వకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే, ఇతర రాష్ట్రాల తరహాలో 100 శాతం బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలనిసర్కారు తాజాగా నిర్ణయించింది.ఏపీ, ఛత్తీసగఢ్, ఒడిసా ప్రభుత్వాలు 100 శాతం బ్యాంకు గ్యారెంటీ ఇస్తేనే మిల్లర్లకు ధాన్యం ఇస్తున్నాయి. మన రాష్ట్రంలో కూడా 100 శాతం బ్యాంకు గ్యారెంటీ తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పౌర సరఫరాల కార్పొరేషన్‌కు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఈ అంశంపై అధికారులు మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. అయితే, 25 శాతం బ్యాంకు గ్యారెంటీకే అంగీకరించని మిల్లర్లు.. 100 శాతం బ్యాంకు గ్యారెంటీకి ఒప్పుకొంటారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మొత్తంమీద ధాన్యానికి బ్యాంకు గ్యారెంటీపై ఉత్కంఠ నెలకొంది.ఇతర రాష్ట్రాల్లో..ఆంధ్రప్రదేశ్‌లో బోనస్ సిస్టమ్ లేదు. అక్కడ కనీస మద్దతు ధరకే ధాన్యం కొంటున్నారు. కానీ, మిల్లర్ల నుంచి వంద శాతం బ్యాంకు గ్యారెంటీ తీసుకుంటున్నారు. ఛత్తీసగఢ్, ఒడిసాలో కూడా 100 శాతం గ్యారెంటీ తీసుకొని మిల్లర్లకు ధాన్యం అప్పగిస్తున్నారు. ఛత్తీసగఢ్, ఒడిసాల్లో క్వింటాకు రూ.3,100 చొప్పున ధాన్యం సేకరిస్తున్నారు. దీంతో అక్కడ బ్యాంకు గ్యారెంటీ విధానాన్ని అమలు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించింది. క్వింటా రూ.2,800 చొప్పున కొనుగోలు చేస్తామని ప్రకటించింది. దీంతో ఇక్కడా 100 శాతం బ్యాంకు గ్యారెంటీ అమలు చేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్తులు తాకట్టు పెట్టి బ్యాంకు గ్యారెంటీ లెటర్ తెస్తే.. మిల్లర్లకు బాధ్యత, భయం ఉంటాయని.. నిబంధనల మేరకు కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను అందిస్తారనే ప్రతిపాదన వచ్చింది. ఇప్పటికే ఖరీఫ్ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో బ్యాంకు గ్యారెంటీపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోనుంది. అదే క్రమంలో బ్యాంకు గ్యారెంటీ ఇచ్చినప్పటికీ డిఫాల్టర్లకు ధాన్యం ఇవ్వకూడదనే అంశంపైనా చర్చిస్తున్నట్లు సమాచారం.

# గోవా రైలుకు పచ్చజెండా



**శాసనసభ / హైదరాబాద్:** సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది.అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాపను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

( మొదటి పేజీ తరువాయి )

## ఆ రెండు రాష్ట్రాల్లో బీజేపీకి ఓటమి ఖాయం

ఢిల్లీలో ఏర్పాటు చేసిన జనతా కీ అదాలత్ బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీపై ధ్వజమెత్తారు. హర్యానా, జమ్మూ కశ్మీర్ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని అన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక పార్టీ అని విమర్శించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని... డబుల్ ఇంజిన్ అంటే ద్రవ్యోల్బణం, అవినీతి అని వ్యాఖ్యానించారు. ఇక, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, దేశంలోని బీజేపీ కూటమి పాలిత 22 రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చితే, తాను బీజేపీ తరఫున ప్రచారం చేస్తానని కేజ్రీవాల్ స్పష్టంచేశారు. మరి తన డిమాండ్ నెరవేర్చేందుకు బీజేపీ సిద్ధంగా ఉందా? అని సవాల్ విసిరారు.

## సీఎం రేవంత్ రెడ్డికి ఈటల బహిరంగ లేఖ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ నేత, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ బహిరంగ లేఖ రాశారు. తాను పేదల అభ్యున్నతే లక్ష్యంగా కొట్లాడిన వ్యక్తినని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం చేపడుతున్న మూసీ ప్రక్షాళనకు అడ్డు తగలబోనని స్పష్టం చేశారు.అయితే, పట్టా ఇళ్లలో ఉంటున్న వారిని బఫర్ జోన్ పేరుతో అక్రమంగా నివాసం ఉంటున్నారని చిత్రీకరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. పిడికెడు అక్రమ ఇళ్లను బూచిగా, రూ. కోట్ల విలువ చేసే ఇళ్లను కూలగొడుతున్నారని విమర్శించారు."మమ్మల్ని కాలకేయులతో పోల్చడం మీకు సంస్కారమేనా? మూసీ నది ప్రక్షాళనకు మీ కార్యాచరణ ప్రణాళిక ఏంటి? డీపీఆర్ సిద్ధంగా ఉందా? ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయం ఏమైనా చేస్తున్నారా? కోట్ల విలువైన ఇళ్లు కూలగొట్టి, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామంటే ఎలా? ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ నిర్ధారించకుండా ఎలా కూల్చివేస్తారు?" అంటూ ఈటల సూటిగా ప్రశ్నించారు.హైదరాబాద్ భవిష్యత్ ను, అభివృద్ధిని ప్రశ్నార్థకంగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

( మొదటి పేజీ తరువాయి )

## కాశ్మీర్‌లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాదు..? అసలు తప్పు ఎక్కడ జరిగింది..?

ఇక్కడ జమ్మూ ప్రాంతంలో మాత్రం బీజేపీ ఘనంగా బలపడుతుందని సర్వేలు అంచనా వేస్తున్నాయి. జమ్మూలో ఉన్న 43 సీట్లలో బీజేపీ 27-31 స్థానాలు గెలుచుకుంటుందని చెబుతున్నాయి. ఇక కాశ్మీర్ లోయలోని 47 స్థానాల్లో మాత్రం బీజేపీ ఖతా తెరిచే పరిస్థితి కనిపించడం లేదు. మొత్తంగా ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఫరూఖ్ అబ్దుల్లా నేతృత్వంలోని ఎన్సీ-కాంగ్రెస్ కూటమికి మాత్రం గుడ్ న్యూస్‌గా చెప్పొచ్చు. ఇక్కడ కాంగ్రెస్ పెద్దగా బలపడకపోయినప్పటికీ, ఎన్సీ సొంత బలంపైనే ఆధారపడింది.అసలు ఎక్కడ తప్పు జరిగింది..?లోక్‌సభ ఎన్నికల్లో లోయలోని మూడు పార్లమెంట్ సెగ్మెంట్లకు బీజేపీ పోటీ కూడా చేయలేదు. ఇక్కడే బీజేపీకి సీన్ అర్థమైంది. నిజానికి ఆర్టికల్ 370 రద్దు కాశ్మీర్ ప్రజల అభివృద్ధికి ఆటంకం అని ఒప్పించడంలో బీజేపీ విఫలమైంది. తమకు ఉన్న హక్కును బీజేపీ తీసేసిందనే భావన లోయలోని ముస్లింలలో పేరుకుపోయింది. దీనికి తోడు ఆర్టికల్ 370 రద్దు సమయంలో చాలా రోజుల పాటు ఈ ప్రాంతంలో ఆంక్షలు విధించడం కూడా ప్రజల్లో కోపాన్ని నింపింది.దీనికి తోడు ఫరూఖ్ అబ్దుల్లా ఎన్సీ, మెహబూబా ముఫ్తీ పీడీపీ పార్టీలు ఆర్టికల్ 370 రద్దుని తమకు జరిగిన అన్యాయంగా చిత్రీకరించాయి. దీనిని బీజేపీ బలంగా కౌంటర్ చేయలేకపోయింది. తీవ్రవాదం, వేర్పాటువాదం, రాళ్లదాడులు తగ్గినప్పటికీ, ఇక్కడ ప్రజలు తమ మాట్లాడే హక్కును కోల్పోయామనే భావనని కలిగి ఉన్నారు. దీంతోనే లోయపై బీజేపీ పట్టు కోల్పోయింది. కాశ్మీర్ లోయలో పెద్ద ఎత్తున పెట్టుబడులు అక్కడి స్థానిక విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని బీజేపీ హామీ ఇచ్చింది. దీంట్లో పెద్దగా పురోగతి లేకుండా పోయింది. ఏదైమైనా జమ్మూ కాశ్మీర్‌లో బీజేపీ బలమైన శక్తిగా ఎదిగినప్పటికీ, లోయలోని ఓటర్లను మాత్రం ఆకట్టుకోలేకపోయిందనే భావన ఎగ్జిట్ పోల్స్‌లో వ్యక్తమైంది.

## తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి



**శాసనసభ / హైదరాబాద్:** ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు.కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీసను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముప్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

## మళ్లీ వీఆర్‌వోల సేవలు.. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఓ అధికారి

- కొత్త చట్టం రాకముందే పునరుద్ధరణ
- దేశానికి రోల్‌మోడల్‌గా రూపకల్పన
- ఉద్యోగుల జాబ్ చార్టుకు కమిటీ
- 17 మంది అధికార్లకు ఐఏఎస్ హోదా



**శాసనసభ / హైదరాబాద్:** రాష్ట్రంలో మళ్లీ వీఆర్‌వో, వీఆర్‌ఏల సేవలను వినియోగించుకోనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని, కొత్త రెవెన్యూ చట్టం రాకముందే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఆదివారం రాష్ట్రంలోని 272 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కల్లెక్టర్లు, డిప్యూటీ కల్లెక్టర్లతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీఐలో మంత్రి పొంగులేటి ముఖాముఖి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలతో రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందని ఆరోపించారు. మళ్లీ అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉద్యోగులను, మేధావులను సంప్రదించి వారి సూచనలు, సలహాలు స్వీకరించామన్నారు. తెలంగాణ కొత్త రెవెన్యూ చట్టాన్ని దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా తీసుకువస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణితో ఎదురైన కష్టాల నుంచి విముక్తి కల్పించేలా దీనిని రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. కొత్త చట్టానికి సంబంధించి నల్లగొండ జిల్లాలోని తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూముల రికార్డులు టాంపరింగ్‌కు గురికాకుండా డిజిటలైజేషన్ చేయనున్నట్టు ప్రకటించారు.ఉద్యోగులందరికీ శిక్షణ..కొత్తగా ఉద్యోగంలో చేరిన వారితోపాటు సర్వీసులో ఉన్న ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఉద్యోగులకు జాబ్ చార్ట్ రూపొందించాలని, దీనిపై కమిటీని ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఉద్యోగుల సంబంధించి పదోన్నతుల వంటి ఆర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఇక రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను కొత్తగా తీసుకువస్తామని, అలాగే 17 మంది సీనియర్ అదనపు కలెక్టర్ క్యాడర్ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్‌లను పూర్వ స్థానాలకు బదిలీ చేయడానికి దసరాలోపే నిర్ణయం తీసుకుంటామన్నారు.వాహనాల అద్దెలను ఈ నెలాఖరు వరకు 50 శాతం క్లియర్ చేస్తామన్నారు. గత ప్రభుత్వం మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను పెంచింది తప్ప.. అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదని మంత్రి ఆరోపించారు. దాదాపు 200 మండలాలకు సొంత భవనాలు లేవన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి, తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కల్లెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి భాస్కర్‌రావు, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

శాసనసభ
సోమవారం 07 అక్టోబర్ - 2024

## షూటింగ్‌కి ముందే హీటెక్కిస్తున్న స్పిరిట్



ప్రభాస్ 'స్పిరిట్' సినిమా షూటింగ్ ఇప్పటివరకూ మొదలుకాలేదు. కానీ సినిమాపై వస్తున్న వార్తలు మాత్రం అభిమానులకే కాక, సగటు ప్రేక్షకులకు కూడా హీట్ పుట్టిస్తున్నాయి. ఇప్పటికే 'స్పిరిట్'లో సైఫ్‌అలీఖాన్, కరీనాకపూర్ నటిస్తున్నారనీ, ఈ భార్యభర్తలిద్దరూ ఇందులో నెగిటీవ్ షేడ్స్ ఉన్న పాత్రలు పోషిస్తున్నారని వార్తలు వచ్చాయి. వాటిని నిజం చేస్తూ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఇటీవలే ఈ జంటను కలిశారు. వారికి కథ, పాత్రలు కూడా వివరించినట్టు బీటౌన్ సమాచారం. ఇదిలావుంటే.. ఇప్పుడు ఏకంగా మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఈ సినిమాలో భాగం కానున్నారన్న వార్త అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నది. అయితే.. ఇప్పటివరకూ వీటిపై అధికారిక ప్రకటనలు మాత్రం రాలేదు. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ మొదలు కానుంది. సందీప్‌రెడ్డి వంగా మార్క్ యాక్షన్ సీన్స్, వైల్డ్ ఎలిమెంట్స్‌తో హాలీవుడ్ స్థాయిలో 'స్పిరిట్' తెరకెక్కనున్నదనీ, దాదాపు 400కోట్ల నిర్మాణ వ్యయంతో సందీప్ ఈ సినిమాను నిర్మించనున్నారని సమాచారం. టి.సిరీస్, భద్రకాళి పిక్చర్స్ కలిసి నిర్మిస్తున్న ఈచిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడు.



## దసరాకి ముహూర్తం

ఇటీవలే 'సరిపోదా శనివారం'తో మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు నాని. ప్రస్తుతం 'హిట్ 3' చిత్రీకరణతో తీరిక లేకుండా గడిపేస్తున్నారు. ఇప్పుడాయన మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. నాని – శ్రీకాంత్ ఓదెల కలయికలో ఎస్ఎల్‌వీసీ సినిమాస్ పతాకంపై ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. 'దసరా' విజయం తర్వాత వీళ్ల కాంబోలో వస్తున్న రెండో చిత్రమిది. ఇది విజయదశమి సందర్భంగా ఈ నెల 12న కొబ్బరికాయ కొట్టుకోనుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేయనున్నట్లు తెలిసింది. దీనితోనే చిత్ర కథ, ఇతర వివరాలపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈసారి ఇది 'దసరా'కు మించిన యాక్షన్ కథాంశంతో రూపొందనుందని.. నాని మునుపెన్నడూ చూడని భిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని ప్రచారం సాగుతోంది.

### ఫ్యాషన్ పేరుతో శరీరాన్ని చూపించడం

## నాకు ఇష్టం లేదు: ప్రియా భవానీ శంకర్


'కళ్యాణం కమనీయం'తో తెలుగు తెరకు పరిచయమైన నటి ప్రియా భవానీ శంకర్ . కోలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తోన్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తన తదుపరి సినిమా 'బ్లాక్' ను ఉద్దేశించి మాట్లాడారు. గ్లామర్ రోల్స్ పోషించడంపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఫ్యాషన్ పేరుతో శరీరాన్ని చూపించడం తనకు ఇష్టం లేదన్నారు."నా శరీరాన్ని ఒక వస్తువుగా భావించను. ప్రేక్షకులను రప్పించడం కోసం గ్లామర్‌గా కనిపించడం నాకు నచ్చదు. అలాంటి వాటిని అంగీకరించను. కెరీర్ పరంగా ఎప్పుడైనా వెనక్కి తిరిగి చూసుకుంటే ఏ విషయంలోనూ బాధపడకూడదనుకుంటా. అందుకు అనుగుణంగానే ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటా. నెగెటివ్ రోల్ చేయడానికీ వెనుకాడను. ఎందుకంటే అది నా వృత్తి. అలాగే, ఒక హీరోయిన్‌గా ఫ్యాషన్ పేరుతో కొన్నింటిని ప్రమోట్ చేయలేను" అని ఆమె చెప్పారు. గ్లామర్ రోల్స్‌ను ఉద్దేశించి ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది తొలి సారి కాదు. గతంలోనూ ఆమె తన అసంతృప్తి వ్యక్త పరిచారు. "ఫేమ్ సొంతం చేసుకోవడానికి గ్లామర్ అనేది షార్ట్ కట్ అని కొంతమంది భావిస్తుంటారు. నిజం చెప్పాలంటే అది చాలా కష్టమైన పని. దానిని నేను సౌకర్యవంతంగా భావించలేను. అదీకాక ప్రేక్షకులు నన్ను గ్లామర్ పాత్రల్లో చూడటానికి ఇష్టపడరు" అని చెప్పారు. 'బ్లాక్' విషయానికి వస్తే.. జీవా హీరోగా నటించిన ఈచిత్రానికి బాలసుబ్రమణి దర్శకత్వం వహించారు. హారర్ జానర్‌లో ఇది తెరకెక్కింది. అక్టోబర్ 11న విడుదల కానుంది.

## దేవకీనందనుడి ఆగమనం



సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా రూపొందుతోన్న యాక్షన్ ఎంటైర్టైనర్ 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. నవంబర్ 14న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ని, టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ కథలో సోల్ చాలా డెప్త్‌గా ఉంటుందని, దర్శకుడు అర్జున్ జంధ్యాల సినిమాను అద్భుతంగా తీశారని, కథానాయిక మానస వారణాసి ఛాలెంజింగ్ రోల్ చేసిందని, కచ్చితంగా హిట్ సినిమా అవుతుందని హీరో అశోక్ గల్లా నమ్మకం వెలిబుచ్చారు. 'మేం కొత్తవాళ్లమే అయినా మంచి అవుట్‌పుట్‌తో వస్తున్నాం. మా సినిమా రిలీజ్ టైమ్‌లోనే మట్కా, కంగువా సినిమాలు కూడా రిలీజ్ అవుతున్నాయి. అయినా సరే.. మా సినిమా మాదే. కంటెంట్‌ని నమ్మి చేసిన ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. ప్రశాంత్‌వర్మ కథ, సాయిమాధవ్ బుర్రా పదునైన సంభాషణలు, భీమ్స్ సిసిరోలియో ఆకట్టుకునే బాణీలు ఈ సినిమాకు హైలైట్ కానున్నాయి. మా హీరో అశోక్ గల్లాని హీరోగా మరోస్థాయిలో నిలబెట్టే సినిమా ఇది' అని నిర్మాత బాలకృష్ణ చెప్పారు. కృష్ణుడి నేపథ్యంలో కథ నడుస్తుందని, కథలో చక్కని డివోషనల్ టచ్ ఉంటుందని, ఆరంభం నుంచి ముగింపు వరకూ ప్రతి పాత్రా హైలైట్ అయ్యే సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. ఇంకా కథానాయిక మానస వారణాసి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, రసూల్ ఎల్లోర్, సమర్పణ: నల్లపనేని యామిని, నిర్మాణం: లలితాంబిక ప్రొడక్షన్స్.

## మిస్టర్ ఇడియట్ సెలబ్రేషన్స్



అగ్రహీరో రవితేజ తమ్ముడి తనయుడు మాధవ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్‌శర్మ కథానాయిక. గౌరీ రోణంకి దర్శకత్వంలో జె.జె.ఆర్.రవిచంద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవంబర్‌లో సినిమా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ప్రమోషన్‌లో భాగంగా విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా రీసెంట్‌గా విడుదల చేసిన 'కాంతారా కాంతారా..' సాంగ్, ట్రైలర్ సక్సెస్ సెలబ్రేషన్స్‌ని ధృవ ఫ్యాషన్ టెక్నాలజీ కాలేజ్‌లో జరిపారు. తమ ఆనందాన్ని కళాశాల విద్యార్థులతో చిత్ర టీమ్ షేర్ చేసుకున్నారు. ఇదే కాలేజ్‌లో ఈ సినిమా షూటింగ్ జరిపామనీ, ఆ క్షణాలు తన జీవితంలో మరిచిపోలేనివని హీరో మాధవ్ అన్నారు. షూటింగ్ టైమ్‌లో మీరంతా ఎంతో సహకరించారనీ, సినిమా మీకందరికీ నచ్చుతుందనీ డైరెక్టర్ గౌరీ రోణంకి నమ్మకం వెలిబుచ్చారు. టీమ్ అంతా ప్రాణంపెట్టి పనిచేశారని, హీరో మాధవ్ భవిష్యత్‌లో పెద్ద స్టార్ అవుతాడని నిర్మాత జె.జె.ఆర్.రవిచంద్ నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా కథానాయిక సిమ్రాన్, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్, రంగస్థలం మహేశ్ కూడా మాట్లాడారు.



## బంగ్లాతో తొలి టీ20.. విరాట్ కోహ్లీ రికార్డును బ్రేక్ చేసిన హార్దిక్ పాండ్య



బంగ్లాదేశ్‌తో మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. ఆదివారం గ్వాలియర్ వేదికగా జరిగిన తొలి టీ20లో టీమ్‌ఇండియా ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బంగ్లాదేశ్‌ను 19.5 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్.. అనంతరం బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. 128 పరుగుల లక్ష్యాన్ని కేవలం 11.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ మ్యాచ్ చివర్లో హార్దిక్ పాండ్య (39లిబీ 16 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. తస్కిన్ అహ్మద్ వేసిన 12 ఓవర్‌లో వరుసగా 4, 4, 6 బాది మ్యాచ్‌ను ముగించాడు. ఈ క్రమంలోనే హార్దిక్ ఓ రికార్డును నమోదు చేశాడు. భారత్ తరపున టీ20ల్లో అత్యధిక మ్యాచ్‌లను సిక్సర్లతో ముగించిన ఆటగాడిగా ఘనత సాధించాడు. అంతకుముందు ఈ రికార్డు విరాట్ కోహ్లీ పేరిట ఉండేది. కోహ్లీ నాలుగు మ్యాచ్‌లను సిక్సర్లతో ముగించాడు. తాజాగా హార్దిక్ (5 మ్యాచ్‌లు) దాన్ని బ్రేక్ చేశాడు. మాజీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ, రిషభ్ పంత్ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. వీరిద్దరూ మూడేసి మ్యాచ్‌లను సిక్సర్లు బాది ముగించారు. ఇక, ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 49 బంతులు మిగిలుండగానే విజయం సాధించింది. టీ20ల్లో 100 కంటే ఎక్కువ టార్గెట్ ఉన్న మ్యాచ్‌ల్లో ఇదే అత్యధికం. అంతకుముందు 2016లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 100 పరుగుల టార్గెట్‌ని 41 బంతులు మిగిలుండగా ఛేదించింది.

## టీమ్‌ఇండియా ఆల్‌రౌండ్ షో.. బంగ్లాదేశ్‌తో తొలి టీ20లో ఘన విజయం



టెస్టుల్లో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించిన టీమ్‌ఇండియా.. మూడు టీ20ల సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి టీ20లోఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బంగ్లాదేశ్‌ను 19.5 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్.. అనంతరం బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. 128 పరుగుల లక్ష్యాన్ని కేవలం 11.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (16బీ7 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. సంజు శాంసన్ (29బీ 19 బంతుల్లో 6 ఫోర్లు) రాణించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (29బీ 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు తనదైన శైలిలో చెలరేగి ఆడాడు. నితీశ్‌కుమార్ రెడ్డి (16లి) పరుగులు చేయగా.. చివర్లో హార్దిక్ పాండ్య (39లిబీ 16 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. రెండో టీ20 దిల్లీ వేదికగా బుధవారం (అక్టోబర్ 9న) జరగనుంది. బంగ్లా జట్టులో మెహిదీ హసన్ మిరాజ్ (35లిబీ 32 బంతుల్లో 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో (27బీ 25 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. తౌహిద్ హృదయ్ (12), తస్కిన్ అహ్మద్ (12), రిషాద్ హొస్సేన్ (11) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోరుకే పెవిలియన్ బాటపట్టారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి (3/31), అర్ష్‌దీప్ సింగ్ (3/14) అదరగొట్టారు. మయాంక్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్య తలో వికెట్ పడగొట్టారు.

## బంగ్లాతో తొలి టీ20.. టీమ్‌ఇండియా లక్ష్యం 128



గ్వాలియర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టీ20 గ్వాలియర్ వేదికగా జరుగుతోంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో మెహిదీ హసన్ మిరాజ్ (35లిబీ 32 బంతుల్లో 3 ఫోర్లు) టాప్ స్కోరర్. కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో (27బీ 25 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. తౌహిద్ హృదయ్ (12), రిషాద్ హొస్సేన్ (11) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోరుకే పెవిలియన్ బాటపట్టారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి (3/31), అర్ష్‌దీప్ సింగ్ (3/14) అదరగొట్టారు. మయాంక్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్య తలో వికెట్ పడగొట్టారు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే బంగ్లాకు అర్ష్‌దీప్ వరుస షాక్‌లు ఇచ్చాడు. అతడు తన వరుస ఓవర్లలో ఓపెనర్లు లిటన్ దాస్ (4), పర్వేజ్ హుస్సేన్ (8)ను ఔట్ చేశాడు. ఈ క్రమంలో శాంటో, తౌహిద్ బంగ్లాను ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే, తౌహిద్‌ను వరుణ్ చక్రవర్తి బోల్తా కొట్టించాడు. కాసేపటికే మహ్మదుల్లా (1)ను మయాంక్ యాదవ్ పెవిలియన్‌కు పంపాడు. మయాంక్‌కిది తొలి వికెట్ కావడం విశేషం. తర్వాత జాకీర్ అలీ (8)ని వరుణ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. నిలకడగా ఆడుతున్న శాంటో.. సుందర్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రిషాద్.. వరుణ్ బౌలింగ్‌లో హార్దిక్‌కు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన తస్కిన్ అహ్మద్ (12) రనౌటయ్యాడు. హార్దిక్ బౌలింగ్‌లో షోరిఫుల్ ఇస్లాం (0) క్లీన్‌బౌల్డ్ కాగా.. ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో ముస్తాఫిజుర్ (1)ని అర్ష్‌దీప్ వెనక్కి పంపడంతో బంగ్లా ఆలౌటైంది.




తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
|| సోమవారం 07 అక్టోబర్ - 2024 || పేజీలు : 4

# ఆర్టీసీ బస్సు ఎక్కిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**చండూర్ అక్టోబర్ 6 (శాసనసభ న్యూస్) :** మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో ని పలు వీధుల్లో అభివృద్ధి పనుల పరిశీలన లో భాగంగా మునుగోడు బస్ స్టేషన్ సందర్శించారు. మునుగోడు శాసనసభ్యులు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి . చౌటుప్పల్ నుండి మునుగోడు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మునుగోడు బస్టాండ్ కి రావడంతో ఆర్టీసీ బస్సు ఎక్కి మహిళలను, పలకరించారు... మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఎలా ఉందని కాసేపు ముచ్చటించారు... ప్రతిరోజు ఎంతమంది మహిళలు ప్రయాణం చేస్తున్నారని డ్రైవర్ ని అడిగి తెలుసుకున్నారు. ఉచిత ప్రయాణం చేసేవాళ్లము దర్జాగా కూర్చుంటున్నామని టికెట్ తీసుకున్న వాళ్లకు బస్సులో సీటు దొరకడం లేదని ఒక



మహిళ చెప్పిన మాటతో బస్సులో ఒక్కసారిగా అందరూ నవ్వారు.. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇటీవల మరణించిన కార్యకర్తల కుటుంబ సభ్యులకు పరామర్శ

## - మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి





**నాంపల్లి,అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ :** నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల అకాలమరణం చెందిన నాంపల్లి మండల మాజీ జెడ్ పి టి సి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాటి రామలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం తుమ్మలపల్లి గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన నాంపల్లి మండలం మాజీ ఎంపీపీ దండిగ నాగమణి భర్త దండిగ వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా నాంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జింకల యాదయ్య కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామస్తులు వివిధ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో

# భారీ మార్పులకు శ్రీకారం

## మునుగోడు మండల నాయకులతో శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

- మున్సిపాలిటీగా మారనున్న మునుగోడు నియోజకవర్గ కేంద్రం
- ఒకే చోట అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలు
- ఒకే చోట ప్రభుత్వ ఎడ్యుకేషన్ సంస్థలు, ఒకే చోట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లి





**చండూర్ అక్టోబర్ 6 (శాసనసభ న్యూస్) :** మునుగోడు నియోజకవర్గ కేంద్రం లో భారీ మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారు. మునుగోడు శాసనసభ్యులు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మునుగోడు మండల కేంద్రంలో పలు ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ దాని ముందే ఉన్న అంగడి ప్రదేశం, పోలీస్ స్టేషన్ భవనం, మునుగోడు ఎస్సీ బాలుర వసతి గృహ భవనం,ఒకేచోట అన్ని ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ ఉండేలా వాటికి అవసరమయ్యే స్థలం అన్నింటినీ కాలినడకన తిరుగుతూ పరిశీలించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా మార్పులు చేయాలని, వెజ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూడా ఒకే ప్రదేశంలో ఉండాలన్నారు... భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలు జరగాలన్నారు. డిగ్రీ ఇంటర్ పాలిటెక్నిక్ లాంటి కళాశాలలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసుకోవాలని తన ఆలోచనలను మండల నాయకులకు వివరించారు... నియోజకవర్గ కేంద్రంగా ఉన్న మునుగోడు పట్టణన్ని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి దాంట్లో భాగంగానే మునుగోడు నియోజకవర్గ కేంద్రాన్ని మున్సిపాలిటీగా చేయడానికి వాటికి కావాల్సిన ప్రపోజల్స్ని తొందరలోనే తెప్పించుకొని ప్రభుత్వం ద్వారా మున్సిపాలిటీ కేంద్రంగా ఏర్పాటు చేస్తానని తెలిపారు.మునుగోడు నియోజకవర్గాన్ని భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలనే తన విజన్ ను మునుగోడు మండల ముఖ్య నాయకులకు వివరించడంతో శాసనసభ్యుల చిత్తశుద్ధికి హర్షం వ్యక్తం చేశారు. మునుగోడు మండల నాయకులు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

శాసనసభ

సోమవారం 07 అక్టోబర్ - 2024

## బెల్ట్ షాపుల నిర్మూలనకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి



**చండూరు, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ :** బెల్ట్ షాపులు నిర్మూలించిన గ్రామాలకు వెంటనే 10 లక్షల రూపాయల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తున్న ఎమ్మెల్యేరాజగోపాల్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు.గ్రామాల్లో తాగకుండా ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేసుకుంటున్నారు అంటూ ఎమ్మెల్యేకి మహిళల కితాబు ఇచ్చారు.ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రతి ఒక్కరు తాగుడు ఆలోచన మానుకోవాలని మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా బెల్ట్ షాపులను నిర్మూలించాలని గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆలోచనకు ఆచరణకు గ్రామాలకు గ్రామాలే కదిలి వస్తున్నాయి.గ్రామాలలో బెల్ట్ షాప్ నిర్మూలన కమిటీలు నిర్వహించుకుని బెల్ట్ షాపులు నిర్వహించకుండా చూస్తున్నారు. గ్రామస్తులు బెల్ట్ షాపులు నిర్మూలించిన గ్రామాలకు అభివృద్ధిని నిధులు మంజూరు చేస్తున్నారు. ఎమ్మెల్యే మునుగోడు మండలం రావి గూడెంలో బెల్ట్ షాపులు నిర్మూలించినందుకు కమిటీ సభ్యులను మునుగోడు లోని వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో సన్మానించి అభినందనలు తెలిపారు. వెంటనే రావి గూడెం గ్రామ అభివృద్ధికి పది లక్షల నిధులు మంజూరు చేశారు.బెల్ట్ షాపులను నిర్మూలించిన కమిటీ మెంబర్లైన మహిళల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు.మీరు తీసుకున్న బెల్ట్ షాపుల నిర్మూలన నిర్ణయం వల్ల ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేసుకుంటున్నారని, తాగుడు జోలికే వెళ్లట్లేదని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాలలో ఎక్కడ పడితే అక్కడ బెల్ట్ షాపులు ఉండడంవల్ల యువత మద్యానికి బానిసై చెడువైపు వెళ్తున్నారని కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎట్టి పరిస్థితులలో బెల్ట్ షాపులు మూసివేయాల్సిందేనని, ఉదయం నుండి సాయంత్రం వరకు తాగుడు అరికట్టాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పిసిసి,

**తుర్కయంజాల్, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ :** ( టీపీసీసీ ) అధ్యక్షులు, గౌరవ ఏం ఎల్ సి బొమ్మమహేష్ కుమార్ గౌడ్ గాంధీభవన్ లో మర్యాదపూర్వకంగా కలిసిన తుర్కయంజాల్ మున్సిపల్ కౌన్సిలర్, తెలంగాణ పిసిసి సభ్యులు కాకుమాను సునీల్.



## ఆటోను ఢీకొట్టిన లారీ

### - ఒక వ్యక్తి మృతి ముగ్గురికి తీవ్ర గాయాలు

**యాచారం, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఆటోను ఢీకొట్టిన లారీ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శంకర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. గోడుకొండ్ల గ్రామ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీలో నివసించే భాస్కర్ (42) కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. శనివారం కూరగాయలను తీసుకొని గట్టుపల్, అంగడిలో విక్రయించి తిరిగి ఆటోలో స్వగ్రామానికి తిరిగి వస్తుండగా పాత మాల్ కూడలి వద్దకు చేరుకోగానే మర్రిగూడ వైపు వెళుతున్న లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి ఆటోను ఢీకొంది. దీంతో కుడి వైపున కూర్చున్న కూరగాయల భాస్కర్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు అతడిని సమీపంలోని పద్మావతి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. భాస్కర్ మృతదేహాన్ని పోస్ట్ మారం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.



# చింతపల్లి సాయినాథుని సేవలో సినిమా హీరోలు శ్రీకాంత్, తరుణ్

### - ప్రత్యేక పూజలు అనంతరం శాలువాలతో సన్మానించిన ఆలయ పాలకవర్గం






**చింతపల్లి, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** కోరిన కోరికలు తీరుస్తూ కొంగుబంగారమై సకల సౌకర్యాలతో విలసిల్లుతున్న రెండో షిరిడి చింతపల్లి సాయినాథుని ఆలయం. నిత్యం వందలాదిమంది ఈ ఆలయాన్ని దర్శించుకుని తరించడం విశేషం. ఈ నేపథ్యంలో చింతపల్లి మండల కేంద్రంలో ఓ వెంచర్ ను ప్రారంభించడానికి వచ్చిన సినిమా హీరోలు శ్రీకాంత్, తరుణ్. చింతపల్లి ఆలయ అధికారులు హీరోలు శ్రీకాంత్,తరుణ్ లను సాయి సన్నిధి ఆలయ చైర్మన్ మంచి కంటి ధనుంజయ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ప్రత్యేక పూజలలో పాల్గొని సాయినాథుని ఆశీర్వచనం తీసుకున్న అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి గోమాతలను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు హీరోలు ఇద్దరినీ శాలువాలతో సత్కరించి సాయినాథుని జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ ఆలయాన్ని పరిసరాలశుభ్రతను చూసి మంత్రం అయ్యానని, చింతపల్లి సాయినాథుని దర్శనంతో షిరిడిని దర్శించుకున్న అనుభూతితో సంతోషంగా ఉందన్నారు. అనంతరం సాయినాథుని సన్నిధిలో జాతీయ గీతాలాపనలో పాల్గొన్నారు. సాయి సన్నిధికి వరుసగా మూడోసారి ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించిందని, ఆలయ నిర్వహణ, బాబా దర్శనం, ప్రతి గురువారం సంకీర్తన, సత్సంగం, నిత్యాన్నదానం, గోశాల సంరక్షణ నిర్వహణ బాగుందని ఐఎస్ఓ సర్టిఫికెట్ ఇచ్చిందని చైర్మన్ ధనుంజయ తెలిపారు. కార్యక్రమంలో సాయి సన్నిధి ట్రస్ట్ చైర్మన్ మంచి కంటి ధనుంజయ, ఆలయ ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి వూరె కృష్ణయ్య, ఆలయ సభ్యులు కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ళ శ్రీను, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

## పల్లా దేవేందర్ రెడ్డి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి




**దేవరకొండ, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దేవరకొండ పార్టీ కార్యాలయంలో పల్లా పర్వత రెడ్డి భవన్ లో జరిగిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము ఆవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని అన్నారు. బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని, దేశంలో నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందని అన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య ప్రజలు పండగలు కూడా చేసుకోలేని పరిస్థితి ఏర్పడ్డదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేషన్ చేస్తూ పెట్టుబడిదారులకు అనుకూల విధానాల అవలంబిస్తుందని ఆరోపించారు పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలతో పేద మధ్యతరగతి ప్రజలు పండగలు కూడా చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు సమూలంగా మార్చి 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మిక హక్కులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం హరించి వేసిందని అన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు ,పెన్షన్ల పెంపు ,రైతు భరోసా ఇలాంటి హామీలు తక్షణమే అమలు చేయాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఎస్ కనకాచారి అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు యండి మైనుద్దీన్,తూమ్ బుచ్చిరెడ్డి, పోలే వెంకటయ్య. బొమ్మ అచ్చయ్య , ఉప్పునూతల వెంకటయ్య, నూనె రామస్వామి, వలమల ఆంజనేయులు, కే జయరాములు, వై. పాండురంగారెడ్డి, నూనె వెంకటేశ్వర్లు జూలూరు వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో కుంకుమార్చన, అన్న ప్రసాద వితరణ





**చండూర్ అక్టోబర్ 6 (శాసనసభ న్యూస్):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని చండూరు పట్టణంలోని శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారు ఈరోజు శ్రీ లలితాత్రిపుర సుందరీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పూజ కార్యక్రమంలో కూర్చున్నవారు సూరపల్లి లక్ష్మి & సత్తయ్య , సంతోష & రాఘవేంద్ర దంపతులు నిర్వహించిన్నారు, కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు, అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీ రావిరాల నగేష్ మాట్లాడుతూ దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో ఆధ్యాత్మికమైన వాతావరణంలో, ప్రశాంతంగా జరుగుతున్నాయి . ఇందుకు సహకరిస్తున్న దాతలకు, పుర ప్రముఖులకు, యువతకు, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ పోషకులు మంచుకొండ కీర్తి సంజయ్, గట్టు రాజశేఖర్, తాడిశెట్టి సంతోష్ కుమార్, మారగోని శేఖర్ ,బుచ్చాల ప్రవీణ్, పన్నాల శ్యామ్ యాదవ్ లతోపాటు, దేవాలయ ట్రస్ట్ చైర్మన్ కోమటి వీరేశం,పద్మశాలి



సంఘం గౌరవ అధ్యక్షులు పులిపాటి ప్రసన్న, అధ్యక్షులు గుర్రం బిక్షమయ్య, కార్యవర్గ సభ్యులు, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు రావుల వెంకటేశం, కార్యవర్గ సభ్యులు,గాంధీజీ విద్యాసంస్థలు, గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ కోడి శ్రీనివాసులు, మార్కండేయ యువజన సంఘం అధ్యక్షుడు గంజి గంగాధర్, కార్యదర్శి అశోక్, మణికుమార్, కిరణ్, రవి కిషోర్, ఏలే చంద్రశేఖర్ , చిట్టిప్రోలు మహేష్, గంజి బిక్షం, చెరుపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

# దసరాకు పండుగకు పేదలకు దుస్తులు పంపిణీ

## - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఈసి శేఖర్ గౌడ్ (మామ)



**ఆదిభట్ల, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** నిరుపేదల ఆపద్బాంధవుడు ఈసి శేఖర్ గౌడ్ (మామ)అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ అన్నారు.అధిబట్లలో దసరా పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఈసి శేఖర్ గౌడ్ (మామ) తన వ్యవసాయ క్షేత్రంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.మహిళలకు చీరలు వృద్దులకు పంచలు దుస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ హాజరై మాట్లాడుతూ ఈసి శేఖర్ గౌడ్ (మామ) నీరు పేద ప్రజలకు ఆపద్బాంధవుడు అని అన్నారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తూ తన దగ్గరకు వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైన నేనున్నాను అంటూ అర్ధరాత్రి అయినా ప్రజల దగ్గరికి వెళ్లే గొప్ప మనసున్న మహారాజు ఈసీ శేఖర్ గౌడ్ (మామ)అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఒక బీసీ నేతగా మంచి పేరున్నవ్యక్తి గొప్పనాయకుడు ఈసీశేఖర్ గౌడ్ మామ అని, ఇలాంటినాయకుడిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తగిన ప్రాధాన్యత ఇచ్చి నామినేట్ పదవి ఇవ్వాలని మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికితెలియ చేశారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పాండాల శంకరయ్య గౌడ్,తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ దేవా గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె సాయిబాబాగౌడ్,కొంకణి మురళి,నేనవాత్ శ్రీనివాస్ నాయక్ ,కొట్టం సత్యం యాదవ్,తంబాల కృష్ణ,వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ఘట్టుప్పల్ మండలం పరిధిలో గంజాయి (డ్రగ్స్) టెస్ట్ లు



**చండూర్, అక్టోబర్ 6 (శాసనసభ న్యూస్) :** చండూర్ మునిసిపాలిటీ సర్కిల్ ఇన్ స్పెక్టర్ జి. వెంకటయ్య ఆధ్వర్యంలో గట్టుప్పల్ మండలంలో ఆదివారం 8 మందికి డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా అందరికి నెగెటివ్ వచ్చింది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని, ఎవరైనా మండలం లో గంజాయి తాగినా తీసుకొచ్చి విక్రయించిన వారిపేర్లు మాకు పంపగలరని, పంపిన వారి పేర్లు గొప్యంగా ఉంచి వారికి 5 వేల రూపాయలు బహుమతి గా ఇస్తామని, సీ.ఐ వెంకటయ్య అన్నారు. గంజాయి మత్తు మందు మాయలో పడి వారి అమూల్యమైన జీవితాన్నీ, వారినే నమ్ముకున్న కుటుంబానికి అన్యాయం చేస్తున్నారని ఘట్టుప్పల్ మండలం సబ్ ఇన్ స్పెక్టర్ జి. వెంకట్ రెడ్డి తెలిపారు.ఈ విషయంలో పోలిస్ లకు ప్రజలు సహరించగలరని వారు సూచించారు.

# దుర్గామాత హోమంలో కొత్త కుర్మ సత్తయ్య



**తుర్కయంజాల్, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** తుర్కయంజాల్ లోని వింటేజ్ హోమ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన దుర్గమాత పూజ హోమం కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ వైస్ చైర్మన్, రంగా రెడ్డి జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య.ఈ సందర్భంగా దుర్గ మాతను దర్శించుకొని పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం కొత్తకుర్మ సత్తయ్య ను శాలువాతో సన్మానించిన కాలనీ వాసులు.ఈ కార్యక్రమంలో వింటేజ్ హోమ్స్ కాలనీ ప్రెసిడెంట్ శ్రీకాంత్ సింగిడి, వైస్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, జనరల్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ భిక్షం, సభ్యులు కేశవులు, చందన కుమార్, వేముల రాజేశ్వర్ రావు, అశోక్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు .

# ఢిల్లీ చేరిన బాలాపూర్ గణేష్ లడ్డూ



**తుర్కయంజాల్, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఆదివారం ఉదయం ప్రపంచ ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ గణేష్ భగవానుని మహిమ గల లడ్డూ ను తీసుకొని 2024 లడ్డూ విజేత కైవసం చేసుకున్న బిజెపి రాష్ట్ర నేత మాజీ సింగల్ విండో చైర్మెన్ కొలన్ శంకర్ రెడ్డి ఆ లడ్డూ ను ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి అందజేయడానికి రాజధాని ఎక్స్ప్రెస్ రైలు ద్వార నిజముద్దీన్ లో ఉదయం 7 గం కు మిత్రులతో కలిసి లడ్డూను తీసుకొని ఢిల్లీ. ఆదివారం చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేత లడ్డూ విజేత కోలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ చారిత్రాత్మక బాలాపూర్ లడ్డూ ను ప్రధాని శ్రీ మోదీకి ఇచ్చే వరకు హైదరాబాద్ వచ్చేది లేదు బాలాపూర్ గ్రామ ఖ్యాతి జాతీయమై తితో ప్రపంచ ఖ్యాతి చేయడమే నా లక్ష్యం అన్నారు , నాతో పాటుగా రాష్ట్ర బీజేపీ నేతలు శ్రీ డి శ్రీనివాస్, గాజుల మధు , నీల రవినాయక్, చెవ్వ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ
సోమవారం 07 అక్టోబర్ - 2024

## దోటి యాదయ్య తల్లి ఎల్లమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన చండూరు మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న



**చండూరు అక్టోబర్ 6 ( శాసనసభ న్యూస్ ) :** చండూర్ మున్సిపాలిటీ 2వ వార్డ్ కి చెందిన దోటి యాదయ్య , తల్లి దోటి ఎల్లమ్మ, ఆదివారం ఉదయం తెలవారుజామున మ-రణించారు, ఆమె పార్దవదేహానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న , తదితరులు పాల్గొన్నారు

## బెల్ట్ షాప్ లను నిర్మూలిద్దాం : గ్రామాలను అభివృద్ధి చేద్దాం -కొరిమి ఓంకారముల



**చండూరు అక్టోబర్ 6 (శాసనసభ న్యూస్ ):** మునుగోడు శాసన సభ్యులు కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశానుసారం ఆదివారం చండూరు మండలం గోళ్లగూడెం గ్రామంలో మండల కాంగ్రెస్ అద్యక్షులు కొరిమి ఓంకారము ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కమిటి నియమించడం జరిగింది. ఈ కమిటీలో అన్ని వయసుల వారిని అందులో అయిదుగురు మహిళలతో కలిసి మొత్తం పదిహేను మందితో కమిటీ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్ షాపులు,గంజాయి,ఇతర మత్తు పదార్థములు వాడకుండా, అమ్మకుండా కమిటి సభ్యులు గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో గ్రామ తాజా మాజీ సర్పంచ్ లు సాపిడి రాములు, అబ్బన బోయిన లింగయ్య, మాజీ ఎంపీటీసీ ఇరిగి రాజ్, మాజి సర్పంచ్ లు భూత రాజ్ ఆంజనేయులు, బొమ్మర బోయిన సైదులు, కావలి ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ఘనంగా కుంకుమార్చన





**చింతపల్లి, అక్టోబర్ 6 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** శ్రీ రాజ రాజేశ్వర దేవస్థానం (శివాలయం) చింతపల్లి దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువు దీరిన శ్రీ దుర్గాదేవి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం పూజా కార్యక్రమాన్ని కోమిరిశెట్టి వెంకటయ్య కుటుంబ సభ్యులు, ఆలంపల్లి వెంకటయ్య కుటుంబ సభ్యులు, నాళ్ళ శివ కుమార్ కుటుంబ సభ్యులు నిర్వహించారు.ఇందులో భాగంగా కుంకుమార్చన, భక్తులకు అన్నదాన వితరణ చేసిన కోమిరిశెట్టి చంద్రకళ- వెంకటయ్య కుటుంబ సభ్యులు.శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి పుష్పాలంకరణ కోసం వివిధ రకాల పుష్పాల దాత నాళ్ళ సుజిత-శివకుమార్ కుటుంబ సభ్యులు. ఆదివారం కుంకుమార్చన కార్యక్రమంలో సుమారు 300 మంది మహిళలు, భవాని భక్తులు చెనమోని రాములు, సోమరాజు ప్రదీప్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంకి రవి, గోవింద్ ప్రసాద్, గోవింద్ రవికుమార్, బొడ్డు మహేష్, కుందేళ్ళ చెన్నయ్య, నరసింహ్మా, బోలసాని సత్యనారాయణ ప్రజలు పాల్గొన్నారు.

## ఘట్టుపాల్ మండలం పరిధిలో గంజాయి (డ్రగ్స్) టెస్ట్ లు



**చండూర్ అక్టోబర్ 6 (శాసనసభ న్యూస్):** ఘట్టుపాల్ మండలం లో చండూర్ మునిసిపాలిటీ సర్కిల్ ఇన్ స్పెక్టర్ జి. వెంకటయ్య ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఎనిమిది మంది కి డ్రగ్స్ టెస్ట్ లు నిర్వహించగా అందరికి నెగెటివ్ వచ్చింది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఎవరైనా మండలం లో గంజాయి తాగిన తీసుకొచ్చి అమ్మిన వారి యొక్క పేర్లు మాకు పంపగలరు, పంపిన వారి పేర్లు గొప్యంగా ఉంచుతాము, వారికి 5 వేల రూపాయలు బహుమతి గా ఇస్తామని, గంజాయి మత్తు మందు మాయలో పడి వారి అమూల్యమైన జీవితాన్నీ, వారినే నమ్ముకున్న కుటుంబానికి అన్యాయం చేస్తున్నారని ఘట్టుపాల్ మండలం సబ్ ఇన్ స్పెక్టర్ జి వెంకట్ రెడ్డి తెలిపారు.ఈ విషయం లో పోలీస్ లకు ప్రజలు సహరించగలరని సూచించారు.

## డీజేల వినియోగం పై నిషేధం

### - చండూర్ సబ్ ఇన్ స్పెక్టర్ ఎన్.వెంకన్న



**చండూర్ అక్టోబర్ 6 (శాసనసభ న్యూస్) :** నల్గొండ జిల్లాలో ఈ నెల 14 వరకు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు బహిరంగ ప్రదేశాలలో ఉపయోగించే డిజేలతో సహా అధిక వాల్యుమ్ సౌండ్ ఎడిటింగ్ సిస్టమ్ ల వినియోగం పై నిషేధం విధిస్తూన్నట్లు చండూర్ మున్సిపాలిటీ సబ్ ఇన్ స్పెక్టర్ ఎన్.వెంకన్న తెలిపారు. ఆదివారం శాసన సభ ప్రతి నిధి తో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో డీజేలు నుంచి ఉత్పన్నమయ్యే అధిక డెసిబెల్స్ కారణంగా మానవ ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంపై ప్రభావాలు పడుతున్న కారణంగా.. నిషేధించడం జరిగిందన్నారు. అలాగే ఎలాంటి పరిస్థితుల్లోనూ అధిక శబ్దం కలిగించే డిజే లను వినియోగించ రాదన్నారు. ఈ నిషేధ ఉత్తర్వులను చట్టాన్ని ఉల్లంఘించి, ఎవరైనా వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ విషయంలో పోలీసు వారికి సహకరించాలని సూచించారు.

## కొండమల్లేపల్లిలో అమ్మవారిని దర్శించుకున్న పలువురు నాయకులు



**కొండమల్లేపల్లి,శాసనసభ న్యూస్ అక్టోబర్ 6 :** శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ దుర్గా నగర్ ఆంజనేయ స్వామి దుర్గ మాత దేవాలయంలో లలిత త్రిపుర సుందరి దేవి అవతార మూర్తిని దర్శించుకున్న కొండమల్లేపల్లి బంజారా సంఘం నూతన అధ్యక్షుడు రామావత్ లాలునాయక్, ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ సురేష్. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మాజీ సర్పంచ్ రమావత్ రాములు నాయక్, మాజీ ఎంపీటీసీ జగన్ నాయక్, రామావత్ వస్రంకు మాజీ జెడ్పిటిసి, సలహాదారు పసునూరి యుగేందర్ రెడ్డి చే సన్మానం చేయడం జరిగింది.

## కొండమల్లేపల్లి పట్టణం మండలంలో దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న పలువురు నాయకులు



**కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ అక్టోబర్ 6 :** శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ దుర్గా నగర్ ఆంజనేయ స్వామి దుర్గ మాత దేవాలయంలో లలిత త్రిపుర సుందరి దేవి అవతార మూర్తిని ఆ దర్శించుకున్న కొండమల్లేపల్లి బంజారా సంఘం నూతన అధ్యక్షుడు రామావత్ లాలునాయక్, ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ సురేష్, మాజీ సర్పంచ్ రమావత్ రాములు నాయక్, మాజీ ఎంపీటీసీ జగన్ నాయక్, రామావత్ వస్రం గార్లకు మాజీ జెడ్పిటిసి సలహాదారు పసునూరి యుగేందర్ రెడ్డి గారిచే సన్మానం.

జై దుర్గా మాత కి జై

శాసనసభ
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన తెలంగాణ శాసనసభ
తెలుగు దిన పత్రికలో ఈ ప్రాంతాల్లో వార్తలు
సేకరించడానికి విలేకరులు కావలెను.
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు
నల్గొండ జిల్లాలో ఖాళీగా ఉన్న డేట్ లైన్లు
నల్గొండ జిల్లా: చందంపేట, డిండి, పి.ఏ.పల్లి, నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, చండూర్, మునుగోడు, హాలియా, పెదవూర, నిడుమనూరు, నల్గొండ, కనగల్, మిర్యాలగూడ, త్రిపురారం, కట్టంగూర్, తిప్పర్తి, నకిరేకల్ తదితర ప్రాంతలలో పనిచేయుటకు ఆసక్తిగల వారు క్రింది ఫోన్ నంబర్లకు సంప్రదించండి.
తెలంగాణ శాసనసభ దినపత్రిక నెట్‌వర్క్ ఇంచార్జ్ వెంకటేశ్
సెల్: 9949360937,9100900931